

శ్రీశైలం ప్రాజెక్టుకు తగ్గిన ఇన్‌ఫ్లో
- గేట్ల మూసివేత, కొనసాగుతున్న విద్యుత్ ఉత్పత్తి
6

ఆర్‌ఐటీలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

యూరియా కోసం నిరీక్షణ

- సహకార సంఘం కార్యాలయం ముందు బారులు తీరిన రైతులు



ఆత్మకూరు సహకార సంఘం కార్యాలయం ముందు బారులుదీరిన రైతులు
6

రెవెన్యూ అధికారుల తీరుపై నిరసన

- సొంత ఆటోకు నిప్పు పెట్టిన యువకుడు
- తాత పేరిట ఉన్న భూమిని తన పేరున మార్చుకునేందుకు యత్నం
- తహసీల్దార్ కార్యాలయంలో ఫైల్ లేదనడంతో మనస్తాపం

7

ఘనంగా వైష్ణవ కృష్ణాష్టమి వేడుకలు

- హాజరైన అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ దంపతులు



పల్లకీ సేవలో అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ



నాగర్‌కర్నూల్ మండలంలోని తూడుకుర్తిలో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుడితో మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

ఇందిరమ్మ ఇళ్లు నాణ్యతగా నిర్మించాలి

కందనూలు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని నాణ్యతగా నిర్మించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ సూచించారు. సోమవారం నాగర్‌కర్నూల్ మండలంలోని తూడుకుర్తి గ్రామంలో చేపట్టిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని ఆయన పరిశీలించారు. గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని నాణ్యతగా.. వేగవంతంగా పూర్తి చేయించాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. గ్రామానికి మొత్తం ఎన్ని ఇళ్లు మంజూరయ్యాయని, ఇప్పటి వరకు ఎన్ని నిర్మాణ పనులు మొదలయ్యాయి, వాటి పురోగతి ఏ దశలో ఉంది అనే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ప్రతీ లబ్ధిదారుడు నాణ్యతతో గృహాన్ని నిర్మించుకోవడానికి ప్రభుత్వ సహకారం అందుతుందని, అధికారులు తరచు పర్యవేక్షిస్తుండాలని సూచించారు. అనంతరం పల్లె దవాఖానను పరిశీలించారు. దవాఖాన ఆవరణలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలు పిల్లలకు కేవలం చదువు మాత్రమే కాకుండా సరైన ఆరోగ్యం, పౌష్టికాహారం అందించే ముఖ్య వేదికలని సంబంధిత శాఖల అధికారులు గుర్తుంచుకోవాలని సూచించారు.

'గృహజ్యోతి' వెలిగేనా?

- కొత్త రేషన్ కార్డుదారులకు అందని పథకం



- దరఖాస్తు చేసుకోవడానికి తెరుచుకోని వెబ్‌సైట్
- ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందలేదంటున్న అధికారులు

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో గృహ జ్యోతి పథకం కూడా ఒకటి. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ పథకం అమలుకు శ్రీకారం చుట్టింది. పేద, మధ్యతరగతి వర్గాల ప్రజల గృహ అవసరాలకు వినియోగించే విద్యుత్ ప్రతీ నెల 200 యూనిట్ల వరకు ఉచితంగా అందిస్తోంది. ఈ పథకం అమలుకు రేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకోవడంతో చాలా మందికి ఈ పథకం వర్తించలేదు. ఇందుకు బీఆర్ఎస్ పదేళ్ల పాలననే కారణంగా చెప్పవచ్చు. కేసీఆర్ పాలనలో కొత్త రేషన్ కార్డులు ఇవ్వకపోగా ఉన్నవాటిని కూడా కొన్ని తొలగించారు. దీంతో చాలా మంది గృహజ్యోతి పథకానికి నోచుకోలేదు. సుమారు పదేళ్ల తరువాత రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా రేషన్ కార్డులు జారీ చేసింది. కానీ గృహజ్యోతి పథకం వెబ్‌సైట్ బంద్ చేయడంతో కొత్తగా కార్డులు వచ్చిన వారు ఆ పథకానికి నోచుకోవడం లేదు. చాలా కుటుంబాలు గృహజ్యోతి పథకం కోసం ఎదురు చూస్తున్నారు.

ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందలేదు..

నూతన రేషన్ కార్డుదారులకు గృహజ్యోతి పథకానికి దరఖాస్తులు తీసుకోవాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందలేదు. ప్రస్తుతానికి ఆ వెబ్‌సైట్ కూడా బంద్ ఉంది. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వస్తే అమలు చేస్తాం..

- వెంకటేశ్వర్లు, మునిసిపల్ కమిషనర్, వనపర్తి

జిల్లాలో 81,789 గృహ జ్యోతి లబ్ధిదారులు

వనపర్తి జిల్లాలో 1.26 లక్షల నివాస గృహాలకు విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ప్రస్తుతానికి 81,789 కుటుంబాలు గృహ జ్యోతి పథకం కింద ఉచిత విద్యుత్ పొందుతున్నారు. అన్నపూర్ణ, అంత్యోదయ కలిపి జిల్లాలో 1,75,353 రేషన్ కార్డులు ఉన్నాయి. మరో 5,328 మందికి కొత్తగా కార్డులు అందాయి. కొత్త రేషన్ కార్డుల సంఖ్య పెరిగిన నేపథ్యంలో ఉచిత బియ్యం, ఉచిత విద్యుత్, మహాలక్ష్మి పథకంలో భాగంగా సబ్సిడీ సిలిండర్ లబ్ధిదారుల సంఖ్య పెరగనుంది. కొత్త రేషన్ కార్డుల ఆధారంగా బియ్యం ఇవ్వడానికి ముందుకు వచ్చిన ప్రభుత్వం ఉచిత విద్యుత్ , సబ్సిడీ సిలిండర్ అందజేయడానికి మాత్రం ఎలాంటి ఆదేశాలు జారీ చేయలేదు. దీంతో కొత్తకార్డులు వచ్చిన వారు గృహజ్యోతి, సబ్సిడీ సిలిండర్ పథకాల కోసం ఎదురు చూస్తున్నారు.

అక్కాచెల్లెళ్లకు దసరా కానుక

- ఇందిరా మహిళా శక్తి పథకం కింద చీరల పంపిణీ
- ఇప్పటికే గోదాములకు చేరిన చీరలు

అయిజ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అక్కాచెల్లెళ్లకు దసరా కానుకగా ఒక్కొక్కరికి రెండు చీరలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. దసరా పండుగను పురస్కరించుకొని ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా ఈ చీరలు పంచనున్నది. ఇప్పటికే చీరలు జిల్లా కేంద్రంలోని గోదాములకు చేరాయి. జోగుళాంబ గద్వాల జిల్లాలో మెప్మా పరిధిలో 20,990, డీఆర్‌డీఓ పరిధిలో 40,470 మంది మహిళా సంఘం సభ్యులు ఉన్నారు. మొత్తంగా 61,460 మంది మహిళా సంఘ సభ్యులకు ఈ చీరలు అందనున్నాయి. గద్వాల జిల్లాకు సంబంధించి అలంపూర్‌చౌరస్తా, గద్వాలలోని గోదాములలో భద్రపరచినట్లు సమాచారం. వీటిని ఈ నెల 20 నుంచి మహిళా సంఘ సభ్యులకు అందచేయనున్నట్లు జిల్లా రూరల్ డెవలప్‌మెంట్ కార్యాలయ సూపరిండెంట్ సిద్దయ్య తెలిపారు.





వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లురావు

చోరీ కేసులో ఆరుగురి అరెస్టు

- 2.5 తులాల బంగారం, 43 తులాల వెండి స్వాధీనం
- వెల్లడించిన డీఎస్పీ వెంకటేశ్వర్లురావు

7

ప్రాజెక్టుల నిర్మాణంలో విశ్వేశ్వరయ్య సేవలు మరువలేనివి

- శ్రీశైలం ఎడమ గట్టు విద్యుత్ కేంద్రంలో నివాళి అర్పించిన ఇంజనీర్లు



కలెక్టరేట్‌కు వచ్చేందుకు బీరెల్లి వద్ద పడవ దిగుతున్న విద్యార్థులు

చదువు కోసం సాహసం

- పడవ ప్రయాణంతో కలెక్టరేట్‌కు చేరుకున్న విద్యార్థులు
- పాఠశాలకు ఉపాధ్యాయుడు కావాలని ఫిర్యాదు

గద్వాల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అసలే అది దీవి గ్రామం.. కృష్ణానది మధ్యలో ఎత్తైన గట్టుపై ఉన్న గుర్రం గడ్డ గ్రామం. అక్కడికి చేరుకోవాలంటే ఉధృతంగా ప్రవహిస్తున్న నదిలో బోటుపై ప్రయాణం చేయాలి. అభివృద్ధికి దూరంగా ఉన్న ఈ గ్రామ విద్యార్థులు ఇప్పుడు చదువుకు కూడా దూరమవుతున్నారు. అక్కడ పనిచేస్తున్న ఏకోపాధ్యాయుడు గత నెల 26వ తేదీన పదోన్నతిపై బదిలీ అయ్యారు. అప్పటి నుంచి పాఠశాలకు కొత్త ఉపాధ్యాయుడిని నియమించలేదు. దీంతో 35 మంది విద్యార్థులకు పాఠాలు బోధించే వారు కరువయ్యారు. సోమవారం విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పడవలో కృష్ణానది దాటి గద్వాల కలెక్టరేట్‌కు చేరుకున్నారు. మా పాఠశాలకు ఉపాధ్యాయుడిని నియమించాలని కలెక్టరేట్ ముందు నినాదాలు చేశారు. దీంతో అధికారులు విద్యార్థులను నేరుగా కలెక్టర్ చాంబర్‌లోకి తీసుకెళ్లారు. విద్యార్థుల సమస్యలను విన్న కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ మూడు రోజుల్లో మీ పాఠశాలకు ఉపాధ్యాయుడిని నియమిస్తామని హామీ ఇచ్చినట్లు విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు.



కలెక్టరేట్ ముందు నినాదాలు చేస్తున్న విద్యార్థులు

సమస్యలు పరిష్కరించాలి

- అఖిలపక్షం నాయకుల డిమాండ్
- అయిజ మునిసిపల్ కార్యాలయం ముట్టడి



పోలీసుల పహారాలో సాగిన ర్యాలీ
7

నిర్లక్ష్యం చేస్తే చర్యలు

- వసతి గృహాలు, పాఠశాలలను తనిఖీ చేసిన ఎంపీ మల్లు రవి
- ఉండవల్లి జడ్పీహెచ్ఎస్ అభివృద్ధికి రూ.కోటి మంజూరు చేస్తున్నట్లు ప్రకటన



అలంపూరు పట్టణంలోని వసతిగృహంలో మరుగుదొడ్లను పరిశీలిస్తున్న ఎంపీ మల్లు రవి

అలంపూర్/ఎర్రవల్లి/ఉండవల్లి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి అధికారులను హెచ్చరించారు. సోమవారం అలంపూర్ పట్టణంలోని ఎస్సీ బాలికలు, బాలుర వసతిగృహం, ఎర్రవల్లి మండలంలోని ఎస్సీ బాలుర గురుకుల పాఠశాల, కస్తూర్బా గాంధీ పాఠశాల, ఉండవల్లి జడ్పీహెచ్ఎస్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన అలంపూరు ఎస్సీ బాలుర గురుకుల పాఠశాల వద్ద మాట్లాడుతూ వసతిగృహాలలోని విద్యార్థుల పట్ల అలసత్వం వహించరాదని, ఎస్సీ కార్పొరేషన్ ఏడీ సుషిత, అలంపూర్ తహసీల్దార్ మంజుల, వసతిగృహాల వార్డెన్‌లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ బాలికల హాస్టల్‌లో 142 మంది విద్యార్థినులు ఉంటే 42 మంది గైర్హాజరు అయ్యారని, అలాగే బాలుర వసతి గృహంలో కూడా 148 విద్యార్థులకు 53 మంది విద్యార్థులు ఎందుకు గైర్హాజరు అయ్యారని ప్రశ్నించారు. వసతి గృహాలలో మెరుగైన వసతులు కల్పించాలని, సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని అధికారు లకు సూచించారు. వసతి గృహాలలో మరుగుదొడ్లు, స్నానపుగదులను, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అనంతరం జోగుళాంబ, బాల బ్రహ్మేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయాలకు యునెస్కో గుర్తింపు తీసుకురావాలని సీనియర్ సిటిజన్ ఫోరం జిల్లా అధ్యక్షుడు మోహన్‌రావు ఎంపీ మల్లు రవికి వినతి పత్రం అందించారు. అనంతరం ఉండవల్లి జడ్పీహెచ్ఎస్‌ను పరిశీలించారు. తరగతి గదులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి సీఎస్ఆర్ నిధుల ద్వారా కోటి రూపాయలు మంజూరు చేస్తున్నట్లు ఎంపీ ప్రకటించారు. ఆయన వెంట డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ నీలి శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ జోగులరవి, అలంపూర్ మార్కెట్ చైర్మన్ దొడ్డెప్ప, వైస్ చైర్మన్, కుమార్ తదితరులు ఉన్నారు.

బెల్ట్ షాప్‌నకు వేలం

- రూ. 5.53 లక్షలకు కైవసం
- రూ. లక్ష అడ్వాన్స్ కూడా చెల్లించిన వైనం

గద్వాల క్రైం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అధికారికంగా ప్రతీ రెండు సంవత్సరాలకు ఒకసారి వైన్స్ షాపులకు టెండర్లు వేసి వేలం పాట నిర్వహించడం సాధారణం. కానీ, జోగుళాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలం కొండేరు గ్రామంలో ఆదివారం ఏకంగా బెల్ట్ షాపు నిర్వహణకు వేలం పాట నిర్వహించడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామంలో ఆదివారం కొందరు గ్రామస్థుల సమక్షంలో గ్రామంలోని గ్రామపంచాయితీ కార్యాలయంలోనే బెల్ట్‌దుకాణాలకు వేలంపాట నిర్వహించారు. పోటీలో ఐదుగురు ఉండగా ఓ వ్యక్తి ఏకంగా రూ.5.53 లక్షలకు పాటపడి బెల్ట్ దుకాణాన్ని కైవసం చేసుకున్నాడు. ఈ డబ్బును ముగ్గురు వ్యక్తులు కలిసి ఇస్తుండటంతో గ్రామంలో ఏకంగా మూడు బెల్ట్ దుకాణాలు యథేచ్ఛగా ఎనీటైం నిర్వహించేలా గ్రామస్థులు నుంచి అర్హత సాధించారు. ఇలా బెల్ట్ షాపునకు వేలం పాట నిర్వహించడం 10 సంవత్సరాలుగా జరుగుతున్నట్లు తెలుస్తోంది. బెల్ట్ షాపును కైవసం చేసుకున్న వ్యక్తి వెంటనే గ్రామపెద్దలకు రూ. లక్ష అడ్వాన్స్‌గా చెల్లించాడు. మిగతా మొత్తం కూడా త్వరలోనే ఇచ్చేలా ఒప్పందం. అయితే ఈ డబ్బును గ్రామంలో దేనికోసం ఖర్చు చేస్తారనేది తెలియాల్సి ఉంది. ఈ తతంగాన్ని అధికారులు అరికడుతున్న దాఖలాలు లేవు.

బెల్ట్ దుకాణాలకు వేలం నిర్వహిస్తే చర్యలు

బెల్ట్ దుకాణాలను ఏర్పాటు చేయడమే తప్పు, అది కూడా వేలం నిర్వహించి మరీ ఏర్పాటు చేస్తున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం. అది ప్రభుత్వం కేటాయిస్తున్న వైన్ దుకాణాలు కావని, వాటికి వేలం పాట నిర్వహించరాదన్నారు.

- విజయభాస్కర్‌రెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్

యూరియా కోసం నిరీక్షణ

యూరియా కష్టాలు రైతులను వెన్నాడుతూనే ఉన్నాయి. నిరీక్షణ.. ఆందోళనలతో పొలం పనులు వదిలి రోడ్డెక్కుతున్నారు. సోమవారం కూడా ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆందోళనలు చేపట్టారు.



పేటలో యూరియా కోసం బారులు తీరిన రైతులు

● నారాయణపేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రైతులు యూరియా కోసం పెద్దసంఖ్యలో సోమవారం బారులు తీరారు. అయితే పట్టణంలోని యాద్గిర్‌రోడ్ లో ఉన్న ఆగ్రోస్ రైతుకేంద్రం-2లో 450 బస్తాల యూరియా రావడంతో రెట్టింపుగా రైతులు రావడంతో స్థానిక క్రీడామైదనంలో పోలీసులు రైతులను వరుసక్రమంలో ఉంచి వ్యవసాయ అధికా రుల నుంచి టోకెన్లు పంపిణీ చేశారు. 560 మంది రైతులకు టోకె న్లు అందించి మంగళవారం వచ్చే యూరియాను అందిస్తామని చెప్పి పంపించారు.

ఆత్మకూరు: యూరియా కోసం రైతులు గత నెల రోజుల పాటు సహకార సంఘం కార్యాలయం ముందు నిరీక్షిస్తున్న ప్రభుత్వ అధికారులు ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా సోమవారం సహకార సంఘం కార్యాలయానికి 300 బస్తాలు రావడంతో 300 మందికి పైగా రైతులు బారులు తీరారు. ఆదివారం సెలవు దినం కావడంతో సోమవారం అత్యధికంగా రైతులు కార్యాలయానికి చేరుకున్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ అధికారి వినయ్ కుమార్ రైతులకు నచ్చచెప్పారు. 300 బస్తాల యూరియా వచ్చింది.. శుక్రవారం టోకెన్లు పంపిణీ చేసిన రై తులకు మాత్రమే ఇవ్వనున్నట్లు తెలిపారు.

తహసీల్దార్ కార్యాలయం ముట్టడి



మూసాపేట తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించిన రైతులు


మూసాపేట: యూరియా లేక పోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండల రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం యూరియా కొరత తీర్చాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ కార్యాలయం ముట్టడించి ఆందోళన చేపట్టారు. తమకు సరిపడా యూరియాను పంపిణీ చేసేదాక ఆందోళన విరమించబో యని రైతులు మొండి కేశారు. సమాచారం తెలుసుకున్న ఏవో అనీ ల్‌కుమార్, పోలీసు సిబ్బంది అక్కడికి చేరుకుని రైతులకు శతవి ధాలుగా నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు.



నవాబ్‌పేటలో రహదారిపై నిల్చున్న రైతులు

● నవాబ్‌పేట: మండల రైతన్నలు యూరియా కోసం మరోసారి ఆందోళన బాట పట్టారు. సోమవారం నవాబ్‌పేటలోని కేంద్రానికి 450, కొల్లూర్‌లోని ఓ ప్రైవేటు కేంద్రానికి 250 బస్తాల యూరియా రావడంతో సమాచారం తెలుసుకున్న అన్నదాతలు మండల కేంద్రానికి భారీగా చేరుకున్నారు. దీంతో తమకు సరిపడా యూరియా కావాలంటూ మహబూబ్‌నగర్ రహదారిపై అరగంట పాటు ఆందోళన చేపట్టారు. వ్యవసాయ అధికారి క్రిష్ణ కిషోర్, ఎస్ఐ విక్రం జోక్యం చేసుకుని రైతులను సముదాయించారు. దీంతో టోకెన్‌ల ద్వారా మనిషికి ఒకటి చొప్పున యూరియా బస్తాలు అందజేయడంతో రైతులు తీసుకుని గ్రామాలకు వెళ్లిపోయారు.

రైతుల తోపులాట



పెద్దకొత్తపల్లిలో రైతులను శాంతింపజేస్తున్న ఎస్ఐ సతీష్

పెద్దకొత్తపల్లి: సింగిల్ విండో కార్యాలయం వద్ద యూరియా కోసం రైతులు సోమవారం తోపులాట చోటు చేసుకుంది. పెద్దకొత్తపల్లి సింగిల్ విండో కార్యాలయానికి 280బస్తాల యూరియా వచ్చింది. ఉదయం నుంచి క్యూలైన్‌లో ఉన్న రైతులకు రెండు బస్తాల చొప్పున మొదట పంపిణీ చేశారు. రైతులు యూరియా కోసం నిరీక్షించి తీరా మహిళా రైతులు సైతం సొసైటీ గేటు దూకి చొరబడ్డారు. పరిస్థితిని అంచనా వేసుకున్న సొసైటీ అధికారులు, ఎస్ఐ సతీష్‌తోపాటు పోలీస్ సిబ్బంది చేరుకున్నారు. దీంతో రైతులకు ఒక్కొక్క బస్తా చొప్పున యూరియాను పంపిణీ చేశారు. రైతులు యూరియా కోసం పడరాని తిప్పలు పడుతున్నారు. దీంతో రైతులు సొసైటీ కార్యాలయం వద్ద గుమ్మిగూడడంతో పోలీసుల చొరవతో పరిస్థితిని శాం తింపజేశారు.

ఆర్ఐటీఐలో మిగులు సీట్ల భర్తీకి

దరఖాస్తుల ఆహ్వానం

మన్ననూర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలోని అమ్రాబాద్ మండలం మన్ననూరు గిరిజన పారిశ్రామి క శిక్షణ సంస్థ(ఆర్ఐటీఐ)లో మిగిలిన సీట్లను భర్తీ చేసేందుకు ద రఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఆర్ఐటీఐ ప్రిన్సిపాల్ లక్ష్మణస్వా మి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్ఐటీఐ కోర్సులతో పాటుగా, అడ్వాన్సుడ్ టెక్నాలజీ కోర్సుల్లో దరఖాస్తులు చేసుకోదల చిన అభ్యర్థులు ఐటీఐ తెలంగాణ వెబ్‌సైట్‌లో మొబైల్ నంబరు, మెయిల్ ఐడీతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ కాపీతో పాటుగా పాసుపోర్టు సైజ్ ఫోటోలు, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు, కులం, ఆదాయం, స్థానిక పత్రాలతో ఈ నెల 30 వరకు కార్యా లయ పని దినాల్లో మన్ననూరు ఆర్ఐటీఐలో హాజరు కావాలని పేర్కొన్నారు.

కౌన్సెలింగ్ నిర్వహించి విద్యార్హత, మెరిట్, రిజర్వేషన్ ప్రాతిపదికన ప్రవేశాలు కల్పించబడతాయని ప్రిన్సిపాల్ వివరించారు.

వసతులు మృగ్యం...

ప్రయాణం అగమ్యగోచరం

అలంకారప్రాయంగా బస్టాండ్‌లు
- నిరుపయోగంగా ధరూర్, శాంతినగర్ బస్టాండ్లు
- శక్తిపీఠం వద్ద బస్టాండ్ ఉనికి కనుమరుగు
- ప్రహరీకి నోచుకోని అయిజ బస్టాండ్



నిరుపయోగంగా ఉన్న ధరూర్ బస్టాండ్

గద్వాల అర్బన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం లక్షలాది రూపాయలు ఖర్చుచేసి నిర్మించిన ఆర్టీసీ బస్టాండ్‌లు అలంకారప్రాయంగా మిగిలాయి. జోగుళాంబ గద్వాల జిల్లాలో బస్టాండ్ల వద్ద ప్రయాణికుల అవస్థలు అంతా ఇంతా కాదు. ధరూర్‌లో ఇరవై ఏళ్ల క్రితం నిర్మించిన బస్టాండ్ ఇప్పటికే కేవలం అలంకారప్రాయంగా మిగిలిపోయింది. ఈ బస్టాండ్‌లోకి వచ్చేది లేదు.. ప్రయాణికులు నిలిచేది లేదన్న రీతిగా మారింది. ఇక ఐదేళ్లక్రితం మునిసిపాలిటీ పట్టణంగా మారిన శాంతినగర్‌లో బస్టాండ్ నిర్మించినా అందులో ప్రయాణికులు కూర్చునేందుకు, ఇతరత్రా (మూత్రశాలలు, మరుగుదొడ్లు) ఎలాంటి సౌకర్యాలు లేకపోవడంతో ప్రయాణికులు బస్టాండ్ఒకటి ఉందన్న విషయాన్ని మరిచిపోయారు. దీనికి తోడు ప్రధాన రహదారిపైనే నిలిచి వచ్చే పోయే బస్సులను ఎక్కేందుకు ప్రయాణికులు ఇష్టపడుతుండటంతో బస్సు డ్రైవర్లు సైతం బస్టాండ్‌లోకి పోవట్లేదు.

కర్నూలు-రాయచూరు అంతర్‌రాష్ట్ర ప్రధాన రహదారిలో ఉన్న శాంతినగర్ నుంచి రాకపోకలు సాగించే ప్రయాణికుల సంఖ్య ఎక్కువగానే ఉన్నా వారిని బస్టాండ్ వైపు మళ్లించడంలో ఆర్టీసీ సిబ్బంది విఫలమయ్యారు. రద్దీగా ఉండే రోడ్డుపై ప్రయాణికులు పెద్దసంఖ్యలో నిలిచి ఉండటం వల్ల ప్రమాదాలు జరిగే పరిస్థితి ఉన్నా దాన్ని నియంత్రించడంలో ఇతర శాఖల పోలీసు, రెవెన్యూ, మునిసిపల్ అధికారులు సైతం నిర్లక్ష్యంగా వ్యవహరించడం గమనార్హం. ఇక నిత్యం వందలాది మంది ప్రయాణికులు వచ్చే ఐదవశక్తి పీఠం అలంపూర్ జోగుళాంబ దేవి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన బస్టాండ్ ఉనికిని కోల్పోయే పరిస్థితికి చేరింది. ఇక్కడ ఏర్పాటు చేసిన బస్టాండ్ ముందు భాగమంతా ప్రైవేటు వాహనాలు ఆక్రమించి ఉంటుండగా, ఆర్టీసీ బస్సులకు కనీసం అటువైపు వెళ్లే అవకాశం కూడా ఇవ్వడం లేదు. బస్టాండ్ వైపు వెళ్లేందుకు ప్రయత్నించిన కొంతమంది ఆర్టీసీ డ్రైవర్లను అక్కడి ప్రైవేటు వాహనదారులు అసభ్య పదజాలంతో దుషిస్తూ బెదిరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. వాటిని పట్టించుకునే వారు లేరు.



శాంతినగర్‌లో బస్సుల కోసం రోడ్లపై వేచి ఉన్న ప్రయాణికులు (ఫైల్)

నత్తనడకన ప్రహరీ

దాదాపు 30 ఏళ్ల క్రితం ఆరు ప్లాట్‌ఫాంలతో నిర్మించి అయిజ బస్టాండ్‌కు ఇప్పటి వరకు ప్రహరీ లేకపోగా విడి పశువులు, పందులు, కుక్కల స్వైర విహారంతో ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. ఎట్టకేలకు ఏడాది క్రితం ప్రారంభించిన ప్రహరీ పనులు ఇప్పటికీ సగం వరకే పూర్తయ్యాయి. పూర్తి నిర్మాణం కోసం ఇంకెంత కాలం పడుతుందోనని ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

వ్యాపార దుకాణాల నుంచి అధిక ఆదాయం ఉన్నా ఆర్టీసీలో బస్సులు నిలిపే ఖాళీ స్థలంలో సీసీ వేయలేదు. దీంతో పాటు తాగునీరు, మరుగుదొడ్డి సౌకర్యం, విశ్రాంతి గదులు, సీసీ కెమెరాలు లేవు. కాగా, ఇటీవల అయిజ బస్టాండ్‌లో బీజేపీ నాయకులు ప్రయాణికులకు వర్షంలో గొడుగులు పట్టి నిరసన వ్యక్తం చేయడం గమనార్హం. ఆదిశిలా క్షేత్రంగా పేరుగాం చిన మల్దకల్ స్వయంభూ లక్ష్మీవెంక టేశ్వర స్వామిని దర్శించుకునేందు కు భక్తులు పెద్దసంఖ్యలో వస్తుండగా, ఇప్పటి వరకు బస్టాండ్ నిర్మాణం గురించి పట్టించుకునే వారే లేరు. 1987లో మండల కేంద్రంగా ఏర్పాటైన గట్టులో ఇప్పటి వరకు బస్టాండ్ కూడా లేకపోగా, కనీసం బస్‌షెల్టర్ ఏర్పాటు చేయ లేదు. ప్రయాణికులు ఎండలోనే నిలబడే పరిస్థితి ఉంది. ఇదే రకమైన దుస్థితి జాతీయ రహదారి ఎర్రవల్లి క్రాస్ రోడ్డు వద్ద ఉంది. ఇటీవల ప్రయాణికుల ఒత్తిడి మేరకు ఆర్టీసీ అధికారులు తాత్కాలికంగా తడికెలు వేసి కొంత నీడ ఉండేలా ఏర్పాటు చేశారు. అందులోనూ ముగ్గురు, నలుగురు మించి వేచి ఉండే పరిస్థితి లేదు.

అవసరమైన చర్యలకు సిద్ధం

అయిజ బస్టాండ్ ప్రహరీ త్వరలోనే పూర్తికానుంది. అక్కడ ప్లాట్‌ఫాంల అభివృద్ధిపై తగిన చర్యలు చేపడతాం. ధరూర్, శాంతినగర్ బస్టాండ్‌లను పూర్తి స్థాయిలో వినియోగించుకునేందుకు అవసరమైన చర్యలు చేపడతాం. ప్రయాణికులు ఎక్కువగా ఉండే చోట షెల్టర్ల ఏర్పాటుకు సంబంధించి ఉన్నతాధికారులకు నివేదిస్తాం. ఈ విషయంలో దాతల సహకారం తీసుకుంటాం.

- సునీత, గద్వాల ఆర్టీసీ డిపో మేనేజర్

ప్రీ ప్రైమరీ పీఎంశ్రీ విద్యను నిర్వహించాలి

- కొల్లాపూర్‌లో మంత్రి జూపల్లి క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించిన సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీ సిబ్బంది



కొల్లాపూర్‌లో మంత్రి జూపల్లి క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించిన అంగన్‌వాడీ సిబ్బంది

కొల్లాపూర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ ప్రైమరీ పీఎంశ్రీ విద్యను నిర్వహించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదే విధంగా ఎఫ్ఆర్ఎస్‌ను రద్దు చేయాలని అంగన్‌వాడీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పార్వతమ్మ, మాసమ్మ ప్రభుత్వాన్ని కోరారు. అంగన్‌వాడీ, సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం కొల్లాపూర్ పట్టణంలోని మంత్రి జూపల్లి కృష్ణారావు క్యాంపు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నాను ఉద్దేశించి వారు మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం ఐసీడీఎస్‌తో పాటు విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేయడం కోసం నూతన విద్యా విధానాన్ని కొత్త చట్టాన్ని తెచ్చిందన్నారు. ప్రమాదకరమైన ఈ చట్టానికి వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు. పీఎంశ్రీ విద్య పేరుతో ఐదు సంవత్సరాలలోపు పిల్లల్ని విద్యాశాఖకు అప్పగిస్తూ నిర్ణయించడం తక్షణమే ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రీ ప్రైమరీ పీఎంశ్రీ విద్యను అంగన్‌వాడీ కేంద్రాల్లోనే నిర్వహించాలని, విద్యాబోధన బాధ్యతను అంగన్‌వాడీ టీచర్లకు, హెల్పర్లకు అప్పజెప్పాలని వారన్నారు. అంగన్వాడీల ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. సీనియారిటీ బట్టి ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, ఐసీడీఎస్, మంత్రి హామీ ప్రకారం కారుణ్య నియామకాలు త్వరలో చేపట్టాలని డిమాండ్ చేశారు. జీవో నెంబరు 11ను సవరించాలని, టీచర్లతో సమానంగా హెల్పర్లకు 20వేల వేతనం ఇవ్వాలన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం దిగివచ్చి సమస్యలను పరిష్కరించకపోతే ఈ నెల 25న చలో సెక్రటేరియట్ నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రం మంత్రి జూపల్లి కృష్ణారావు ఓఎస్‌డీ కృష్ణయ్యకు అందజేశారు. సీఐటీయూ వనపర్తి జిల్లా కార్యదర్శి మండల రాజు, నాగర్‌కర్నూల్ జిల్లా ఉపాధ్యక్షుడు శివ వర్మ, సహాయ కార్యదర్శి పొదిల రామయ్య, రాము, యూనియన్ జిల్లా నాయకురాలు నీరజ, హుస్సేనమ్మ, చిన్నమ్మ, లక్ష్మి, జ్యోతి, గోవిందమ్మ, సుశీల, భాగ్యమ్మ, జయమ్మ, సులోచన, శ్రీదేవి, లక్ష్మీదేవమ్మ, ఆవాజ్ జిల్లా కన్వీనర్ ఎండీ సలీం, కేవీపీఎస్ మండల కార్యదర్శి బత్తిని రాజు, రజక సంఘం నాయకులు జల్లాపురం సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రూ.2148 కోట్ల రుణ సహాయం

- జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల నియోజకవర్గంలోని వ్యవసాయ రంగానికి బ్యాంకులు రూ.2148 కోట్ల రుణసాయం అందచేయనున్నారని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ధ్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పంట రుణాలకు రూ.1140 కోట్లు, వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.1008 కోట్లు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. గత సంవత్సరం కంటే అదనంగా రూ.472కోట్లు బ్యాంకు బడ్జెట్ పెరిగిందని తెలిపారు. వర్షాలు సమృద్ధిగా కురవడం, రైతులు అధిక విస్తీర్ణంలో పంటలను సాగుచేస్తున్న నేపథ్యంలో రైతులు ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించకుండా, బ్యాంకుల ద్వారా పంట రుణాలను సరళీకృత విధానంలో అందించాలని బ్యాంకు అధికారులను కోరినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల రైతులకు 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.1290కోట్ల పంటరుణాలను అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నా, రూ.867కోట్లు మాత్రమే రైతులకు బ్యాంకు అధికారులు రుణసాయం చేశారని వివరించారు.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జడ్చర్ల మండలానికి రూ.1024కోట్లు, మిడ్జిల్ మండలానికి రూ.283 కోట్లు, నవాబ్‌పేట మండలానికి రూ.361 కోట్లు, బాలానగర్ మండలానికి రూ.190కోట్లు, రాజాపూర్ మండలానికి రూ.102కోట్లు, ఊర్కొండ మండలానికి రూ.186కోట్లు చొప్పున బ్యాంకులు బడ్జెట్‌లో నిధులు కేటాయించడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో గత సంవత్సరం వానాకాలంలో 24773 ఎకరాల విస్తీర్ణంలో మొక్కజొన్న పంటను సాగు చేయడం జరిగిందన్నారు. ప్రస్తుత వానాకాలంలో 41160 ఎకరాల విస్తీర్ణంలో మొక్కజొన్న పంటను సాగుచేస్తున్నారని తెలిపారు. గత సంవత్సరం వరిపంట 61708 ఎకరాలలో పంటసాగు చేయగా, ఇప్పటివరకు 68069 ఎకరాలలో వరినాట్లు వేసినట్లు తెలిపారు. మొక్కజొన్న, వరిపంటల్లో యూరియా వాడకం అధికంగా ఉండటంతో నియోజకవర్గంలో యూరియాకు డిమాండ్ పెరిగిందన్నారు. పెరిగిన డిమాండ్ మేరకు యూరియా సరఫరా చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. గత సంవత్సరం ఖరీఫ్ సీజన్ మొత్తానికి 9వేల మెట్రిక్ టన్నుల యూరియా సరిపోయిందని, ప్రస్తుతం 14వ తేదీ నాటికి 9134 మెట్రిక్‌టన్నుల యూరియాను రైతులకు అందించగలిగామని పేర్కొన్నారు. వ్యవసాయ రంగానికి, రైతులకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించడంతో పాటు అండగా ఉంటామని పేర్కొన్నారు.

ప్రత్యేక విచారణ కమిటీని ఏర్పాటు చేయాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాలనరసింహ

పెద్దకొత్తపల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కొల్లాపూర్ నియోజకవర్గానికి మంజూరైన ఇందిరమ్మ ఇళ్లలో అవకతవకలపై ప్రత్యేక విచారణ కమిటీ ఏర్పాటు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.బాలనరసింహ, సీపీఐ జిల్లా కార్యదర్శి ఫయాజ్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలోని సీపీఐ ఆఫీసు నుంచి ఎంపీడీవో ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాలనరసింహ, సీపీఐ జిల్లా కార్యదర్శి ఫయాజ్‌లు మాట్లాడారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కొంత మంది నాయకులు చెప్పిన వారికి ఇందిరమ్మ ఇళ్లను కేటాయించారన్నారు. ఉండటానికి ఇల్లు లేని వారిని పక్కన పెట్టి అధికార పార్టీ నాయకులు ఇష్టానుసారంగా ఇందిరమ్మ ఇళ్లను కేటాయించడం సరైన పద్ధతి కాదని వారు పేర్కొన్నారు.



ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ శ్రేణులు

తక్షణమే కొల్లాపూర్ నియోజకవర్గంలో ప్రత్యేక విచారణ కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తామని వారు హెచ్చరించారు. జిల్లా కా ర్యవర్గ సభ్యుడు టి.నరసింహ, విజేయుడు, ఏసయ్య, మండల పార్టీ కార్యదర్శి బొలెద్దుల శ్రీను, జిల్లా సమితి సభ్యులు బండి లక్ష్మీపతి, బిజ్జ శ్రీను, కిరణ్‌కుమార్, లక్ష్మీనారాయణ, టి.మల్లయ్య, తందూరి వెంకటమ్మ, బాలస్వామి, సాయిలు, లక్ష్మణస్వామి, బండి కృష్ణయ్య, రాధాకృష్ణ, ఎస్. కృష్ణాజీ, వెంకటస్వామి, ఎండి.మస్తీద్, రాముడు, సలేశ్వరం, ఆంజనేయులు, చెన్నయ్య, రాజయ్య, ఎండి.యూసుఫ్, స్వామి, వివిధ గ్రామాల శాఖ కార్యదర్శులు, వివిధ గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

శ్రీశైలం ప్రాజెక్టుకు తగ్గిన ఇన్‌ఫ్లో

- గేట్ల మూసివేత, కొనసాగుతున్న విద్యుత్ ఉత్పత్తి

గద్వాల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలం ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో తగ్గిపోయింది. సోమవారం 77,861 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నది. దీంతో ప్రాజెక్టు గేట్లను మూసివేసి కుడి, ఎడమ విద్యుత్ కేంద్రాల ద్వార 66,234 క్యూసెక్కులను నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 215 టీఎంసీలు కాగా ప్రస్తుతం 208.28 టీఎంసీలు నిల్వ ఉన్నది. ఆల్మట్టి ప్రాజెక్టుకు 20 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నది. విద్యుత్ ఉత్పత్తి ద్వారా 20 వేల క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టుకు 30 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా గేట్లు విద్యుత్ ఉత్పత్తి ద్వారా 26 వేల క్యూసెక్కులు వదులుతున్నారు. సన్నతి బ్యారేజీ అవుట్‌ఫ్లో 70 వేల క్యూసెక్కులు జూరాలకు వస్తుంది. ప్రస్తుతం జూరాలకు 82 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 6 గేట్లను ఎత్తి 43,326 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 43,443 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు.

తుంగభద్ర నుంచి సుంకేసులకు 30 వేలు క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా అందులో 28 వేల క్యూసెక్కులను శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు.

రేపు జిల్లా ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఈ నెల 25 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల ఫుట్‌బాల్ టోర్నీలో పాల్గొనే జిల్లా పురుషుల జట్టు ఎంపికలు ఈ నెల 17న నిర్వహిస్తున్నట్లు జిల్లా ఫుట్‌బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి భానుకిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. వనపర్తి, గద్వాల జిల్లాలు మినహా పూర్వ మహబూబ్‌నగర్ జిల్లా క్రీడాకారులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఆధార్, బర్త్ సర్టిఫికెట్, 2 పాస్ పోర్టు సైజ్ ఫొటోలతో ఉదయం 7 గంటలకు జిల్లా స్టేడియంలో రిపోర్టు చేయాలని కోరారు.

రాష్ట్ర స్థాయి యోగా టోర్నీలో జిల్లాకు పతకాలు



రాష్ట్రస్థాయి యోగా టోర్నీలో పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నల్గొండ జిల్లాలో సోమవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించారు. 2 బంగారు, 3 వెండి, 2 కాంస్య మొత్తం 7 పతకాలు సాధించినట్లు జిల్లా యోగా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రాములు, బాలరాజు తెలిపారు. పతకాలు సాధించడం పట్ల క్రీడాకారులను వారు అభినందించారు.

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో సత్తాచాటిన కొత్తకోట విద్యార్థులు




కరాటే పోటీల్లో ప్రతిభచాటి సర్టిఫికెట్లు అందుకున్న కొత్తకోట విద్యార్థులు

కొత్తకోట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గాడ్స్‌ఆన్ వారియర్స్ చోటోఖాన్ కరాటే అకాడమీ విద్యార్థులు జాతీయస్థాయి కరాటే పోటీల్లో సత్తాచాటినట్లు అకాడమీ చైర్మన్ మాస్టర్ అబ్దుల్ నబీ తెలిపారు. హైదరాబాద్‌లోని ఉప్పల్ చిల్కానగర్‌లోని బొమ్మ బాలయ్య గార్డెన్‌లో 29వ జాతీయస్థాయి కరాటే పోటీలు ఆదివారం నిర్వహించారు. పోటీల్లో పాల్గొన్న కొత్తకోట విద్యార్థులు అశ్విని, నరేష్, సాద్అలి, వేణువిజయ్ కుమార్, దుర్గా ప్రసాద్ బంగారు పతకాలు, అక్షిత్, శివాని, లక్కీ వెండి పతకాలు సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థులను సోమవారం బాలికల పాఠశాల మైదానంలో అకాడమీ కరాటే మాస్టర్లు అభినందించారు. కార్యక్రమంలో మాస్టర్లు ఇంతియాజ్, హరీష్ యాదవ్, జాఫర్, సాదిక్, ఎస్కేబాబా ఉన్నారు.

రైతులకు కాంగ్రెస్ అండగా ఉంటుంది

- దీక్షలు విరమింప చేసిన శివకుమార్‌రెడ్డి



నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింప చేస్తున్న శివకుమార్‌రెడ్డి

దామరగిద్ద, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కొడంగల్, నారాయణపేట ఎత్తిపోతల పథకంలో భాగంగా భూములు కోల్పోతున్న రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని నారాయణపేట జిల్లా కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం దామరగిద్ద మండలంలోని కానుకుర్తిలో భూములు కోల్పోతున్న భూ నిర్వాసితుల రిలే నిరాహార దీక్షలు 40వ రోజు విరమింప చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. రైతుల కోరిక మేరకు ముఖ్యమంత్రి స్పందించి ఎకరాకు రూ. 14 లక్షల నుంచి రూ. 20 లక్షలకు పరిహారం పెంచారని తెలిపారు. మాజీ ఎంపీపీ వెంకటరెడ్డి, బసిరెడ్డి, జ్ఞానేశ్వర్, భీంరెడ్డి, ఖాజా,వెంకట్రాంరెడ్డి, ఆనంద్, రైతులు, అఖిల పక్షం నాయకులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని మహిళ మృతి

అలంపూర్ చౌరస్తా, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. జోగులాంబ గద్వాల జిల్లా, ఉండవల్లి మండల పరిధిలో సంఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆదివారం అర్ధరాత్రి రోడ్డు దాటుతున్న ఓ మహిళను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె మృతదేహం మీదుగా పలు వాహనాలు వెళ్లడంతో శరీర భాగాలన్నీ చెల్లా చెదురుగా పడిపోయాయి. సమాచారం అందుకున్న ఎస్‌ఐ శేఖర్ సిబ్బందితో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అక్కడ పసుపు రంగు చీర, నీలం రంగు లంగా, బ్రౌన్ కలర్ జాకెట్, కాలి పట్టీలు, తాయత్తు, తాళం చెవులు లభించాయి. వివరాలు తెలిసిన వారు ఉండవల్లి పోలీసు స్టేషన్లో సంప్రదించాలని ఎస్‌ఐ కోరారు.

పొలంలో పని చేస్తూ కౌలు రైతు..

వంగూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : వరి చేనులో కలుపు తీస్తూ ఓ యువ రైతు కుప్పకూలిపోయాడు. ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా, వంగూరు మండలంలోని సర్వారెడ్డిపల్లి తండాకు చెందిన నేనావత్ శ్రీను (38) చౌదర్‌పల్లి సమీపంలో పొలం కౌలుకు తీసుకొని వరి సాగు చేస్తున్నాడు. సోమవారం కూలీలతో కలిసి చేనులో కలుపు తీస్తూ అకస్మాత్తుగా కుప్పకూలిపోయాడు. కొద్ది సేపటి తర్వాత కూలీలు గమనించి ఆటోలో వంగూరుకు తరలించారు. అక్కడి నుంచి 108 అంబులెన్సులో కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అతడికి భార్య పోమ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

అదృశ్యమైన మహిళ మృతదేహం లభ్యం


ఆరెకంటి లక్ష్మీ (ఫైల్)

లింగాల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : అదృశ్యమైన ఓ మహిళ మృతదేహం లభ్యమైంది. నాగర్‌కర్నూల్ జిల్లా, లింగాల మండల పరిధిలోని కొత్తచెరువు తండాకు చెందిన ఆరెకంటి లక్ష్మి (45), భర్త కుర్మయ్యల మధ్య ఈ నెల 12న గొడవ జరిగింది. ఆ తర్వాత భర్త పొలానికి వెళ్లిపోయాడు. సాయంత్రం తిరిగి వచ్చే సరికి భార్య కనిపించలేదు. ఆమె కోసం చుట్టుపక్కల ఇళ్లలో, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆదివారం లింగాల పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. సోమవారం అంబటిపల్లి గ్రామ సమీపంలోని ఓ రైతు పొలంలోని గుంతలో ఆమె మృతదేహం కనిపించింది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటేశ్‌గౌడ్ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

మల్దకల్, సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి) : దంపతుల మధ్య గొడవ జరిగింది. ఆవేశానికి గురైన భార్య అతడిపై సలసల మరుగుతున్న నూనె గుమ్మరించింది. దీంతో తీవ్రంగా గాయపడిన అతడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన జోగులాంబ గద్వాల జిల్లా, మల్దకల్ మండలంలోని మల్లె దొడ్డిలో జరిగింది. మల్దకల్ ఎస్‌ఐ నందీకర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి ముల్లుంటి వంకటేశ్ (25), అతడి భార్య పద్మ ఈ నెల 11వ తేదీన గొడవపడ్డారు. దీంతో క్షణికావేశానికి గురైన పద్మ భర్తపై వేడినూనె పోసింది. దీంతో తీవ్రంగా గాయపడిన భర్త వెంకటేశ్‌ను కుటుంబ సభ్యులు గద్వాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. వారికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వేర్వేరు చోట్ల ముగ్గురి అదృశ్యం

- కోడేరు, రేవల్లిలలో యువతులు
- నవాబ్‌పేటలో వివాహిత

కోడేరు/ రేవల్లి/ నవాబ్‌పేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : వేర్వేరు చోట్ల ఇద్దరు యువతులు, ఓ వివాహిత అదృశ్యం అయ్యారు. కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా, కోడేరు మండల పరిధిలోని ఖానాపూర్ గ్రామానికి చెందిన యువతి అనూష (19) అదృశ్యం అయ్యింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనూష ఈనెల 3వ తేదీన గ్రామంలో వినాయక చవితి ఉత్సవానికి వెళ్లివస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లి, తిరిగి రాలేదు. స్నేహితులు, బంధువుల ఇళ్లలో ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబ సభ్యులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పాన్‌గల్ మండలంలోనిచింతకుంట గ్రామానికి చెందిన వ్యక్తిపై అనుమానం వ్యక్తం చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ జగదీశ్వర్ తెలిపారు.

● వనపర్తి జిల్లా, రేవల్లి మండలంలోని ఏదుల మండలంలోని చెన్నారం గ్రామానికి చెందిన బంకల పూజ (19) అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. శనివారం ఆమె హైదరాబాద్‌కు వెళ్తున్నట్లు చెప్పి బస్సు ఎక్కింది. ఆ తర్వాత తండ్రి బంకల రాములు ఆమెకు ఫోన్ చేయగా కలువలేదు. బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్ తెలిపారు.

● మహబూబ్‌నగర్ జిల్లా, కొండాపూర్ గ్రామానికి చెందిన ఓ మహిళ అదృశ్యమైనట్లు ఎస్‌ఐ విక్రం తెలిపారు. గ్రామానికి చెందిన వడ్డె శేఖర్‌కు రెండు నెలల క్రితం మహేశ్వరి అనే యువతితో వివాహమైంది. ఈ నెల 14న రాత్రి ఇద్దరూ భోజనం చేసి పడుకున్నారు. మరుసటి రోజు తెల్లవారు జామున నిద్ర లేచిన శేఖర్‌కు భార్య మహేశ్వరి కనిపించలేదు. దీంతో ఆందోళనకు గురైన అతడు బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చోరీ కేసులో వ్యక్తికి ఏడాది జైలు

ఊర్కొండ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : చోరీ కేసులో ఓ వ్యక్తి ఏడాది జైలు శిక్ష పడినట్లు ఎస్‌ఐ కృష్ణదేవ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా, కల్వకుర్తి మండలంలోని జీడిపల్లి గ్రామానికి చెందిన బాషమోని సైదులు మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల పట్టణంలో నివసిస్తున్నారు. అతడు ఈ ఏడాది ఫిబ్రవరి 28న ఊర్కొండ మండలంలోని ముచ్చర్లపల్లి గ్రామంలో మాజీ సర్పంచు వీరెడ్డి పర్వత్‌రెడ్డి ఇంట్లో దాదాపు రూ. 4.8 లక్షల విలువైన బంగారాన్ని ఎత్తుకెళ్లాడు. బాధితుడి సోదరి శశికళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొన్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితుడిని గుర్తించి అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. సోమవారం అతడిని కల్వకుర్తి జూనియర్ సివిల్ కోర్టులో హాజరు పరిచారు. అతడిపై నేరం రుజువు కావడంతో ఏడాది సాధారణ జైలు శిక్షతో పాటు, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ న్యాయాధికారి కావ్య తీర్పు వెల్లడించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతాం

- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనుల పురోగతిపై ప్రభుత్వం దృష్టి సారించాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. లేకపోతే పార్టీలకు అతీతంగా అందరినీ కలుపుకొని ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తామని స్పష్టం చేశారు. ఈ అంశంపై చర్చించేందుకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు సోమవారం హైదరాబాద్‌లోని శ్రీనివాస్‌గౌడ్ నివాసంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు 85 శాతం పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిపోయిన పనులను వెంటనే పూర్తి చేయాలని కోరారు. ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే.. మహబూబ్‌నగర్ జిల్లాలో 15 లక్షల ఎకరాలకు పైగా సాగునీరు అందించొచ్చన్నారు. తద్వారా వలసలను నివారించవచ్చని తెలిపారు. సమావేశంలో మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, పలువురు మాజీ ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

ప్రాజెక్టుల నిర్మాణంలో విశ్వేశ్వరయ్య సేవలు మరువలేనివి

- పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్
- పీయూలో ఘనంగా ఇంజనీరింగ్ డే


సమావేశంలో మాట్లాడుతున్న పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్

పాలమూరు యూనివర్సిటీ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): దేశంలోని చాలా ప్రాజెక్టుల నిర్మాణంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య పాత్ర, సేవలు మరువలేనివని పీయూ వీసీ, ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఫార్మసీ కళాశాలలోని లా ఆడిటోరియంలో ఇంజనీరింగ్ డే ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విశ్వేశ్వరయ్య చిత్ర పటానికి పీయూ రిజిస్ట్రార్ పూస రమేశ్‌బాబుతో కలిసి పూలమాల వేసి నివాళి అర్పించారు.

ఈ సందర్భంగా వీసీ జీఎన్ శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులకు మోక్షగుండం విశ్వేశ్వరయ్య గురించి, ఆయన సేవల గురించి వివరించారు. ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు ఇంజనీరింగ్ విభాగంలో బాగా రాణించాలని అన్నారు. ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సి పాల్ డాక్టర్ చంద్రకిరణ్, ఇంజనీరింగ్ విభాగ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విశ్వేశ్వరయ్యకు ఘన నివాళి..


శ్రీశైలం ఎడమ గట్టు విద్యుత్ కేంద్రంలో నివాళి అర్పిస్తున్న ఇంజనీర్లు

బ్రహ్మగిరి (ఆంధ్రజ్యోతి): జాతీయ ఇంజనీర్ల దినోత్సవం సందర్భంగా మోక్షగుండం విశ్వేశ్వరయ్యకు ఘన నివాళి అర్పించారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని శ్రీశైలం ఎడమ గట్టు భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో సోమవారం విశ్వేశ్వరయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జెన్‌కో సీఈ కేవీవీ సత్యనారాయణ అధ్వర్యంలో ఇంజనీర్లు ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సీఈ మాట్లాడుతూ ఇంజనీరింగ్ వ్యవస్థకు మోక్షగుండం విశ్వేశరయ్య దర్శానికుడిగా, విద్యాప్రదాతగా, పారిశ్రామిక ప్రగతి పరిశోధకుడిగా ప్రత్యేకతను చాటారన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఈలు ఆదినారాయణ, రవీంద్రకుమార్, పవర్ ఇంజనీరింగ్ అసోసి యేషన్ కార్యదర్శి, ఏడీఈ మదన్‌మోహన్‌రెడ్డి, డీఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఏఈలు నరేశ్, నరేందర్, కుమార్ పాల్గొన్నారు.

నాల్గవ స్నాతకోత్సవానికి కమిటీల ఏర్పాటు

పాలమూరు యూనివర్సిటీలో అక్టోబరు 16న నాల్గవ స్నాతకోత్సవాన్ని నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ స్నాతకోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో పీయూ వీసీ ప్రొఫెసర్ జీన్ శ్రీనివాస్ స్నాతకోత్సవ చైర్మన్‌గా కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లు చేసేందుకు విభాగాల వారిగా కమిటీలను ఏడు రకాల కమిటీలను సోమవారం నియమించారు. వారికి విభాగాల వారీగా స్నాతకోత్సవ పనులు విభజన చేసి, దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ పూస రమేశ్ బాబు, అధికారులు పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారుల తీరుపై నిరసన

- సొంత ఆటోకు నిప్పు పెట్టిన యువకుడు
- తాత పేరిట ఉన్న భూమిని తన పేరున మార్చుకునేందుకు యత్నం
- తహసీల్దార్ కార్యాలయంలో ఫైల్ లేదనడంతో మనస్తాపం


మంటల్లో కాలిపోతున్న ఆటో

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ అధికారుల తీరుతో విసిగిపోయిన ఓ యువకుడు తనకు జీవనాధారమైన ఆటోకు నిప్పంటించి దహనం చేశాడు. సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా, దేవరకద్ర మండలంలోని బసాయిపల్లికి చెందిన బాలశంకర్ ఆటో నడుపుకుంటూ జీవనం గడుపుతున్నాడు. తాత పేరున ఉన్న పొలంలో 1.03 ఎకరాల భూమి అతడికి రావలసి ఉన్నది. ఆ భూమిని తన పేరున మార్పించుకుందుకు నాలుగైదేళ్లుగా ప్రయత్నిస్తున్నాడు. దీనికి సంబంధించి ఆర్డీఓ ఆఫీసు నుంచి ఆరునెలల క్రితమే దేవరకద్ర తహసీల్దార్ కార్యాలయానికి వెళ్ళింది. ఓఆర్‌సీ తీసుకెళ్ళి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే పని అయిపోతుందని అధికారులు చెప్పారు. కానీ అక్కడి అధికారులు అప్పుడు, ఇప్పుడు అని తిప్పించుకుంటున్నారు. ఓ అధికారులు డబ్బు అడిగితే కొంత మొత్తం చెల్లించాడు. మిగతాది ఇవ్వాల్సి ఉంది. ఈ క్రమంలో సోమవారం కార్యాలయానికి వెళ్ళిన శంకర్‌కు అక్కడి అధికారులు మీ ఫైల్ లేదని, మళ్ళీ దరఖాస్తు చేసుకోవాలని చెప్పడంతో తీవ్ర మనస్తాపానికి లోనయ్యాడు. అక్కడి నుంచి భార్య, పిల్లలతో కలిసి ఆటోలో జిల్లా కేంద్రానికి చేరుకున్నాడు. బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం ముందు ఆటోను నిలిపి, పెట్రోల్ పోసి నిప్పంటించాడు. మనం కూడా మంటల్లో పడదామంటూ భార్యా పిల్లలను లాగుతుండగా స్థానికులు మందలించి, అడ్డుకున్నారు. సమాచారం అందుకున్న టూటౌన్ పోలీసులు అక్కడికి చేరుకుని శంకర్‌ను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తీసుకెళ్ళారు. అతడు తనకు జరిగిన అన్యాయాన్ని పోలీసులకు వివరించాడు. సీఐ ఎజాజుద్దీన్ అతడికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆర్డీవో అనిల్‌కు ఫోన్ చేసి విషయాన్ని వివరించారు.

తాము ఓఆర్‌సీ ఇచ్చామని, తహసీల్దార్ కార్యాలయంలో పని కాలేదన్న విషయంపై తమకు ఫిర్యాదు చేయలేదని ఆయన తెలిపారు. వెంటనే పని పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇవ్వడంతో బాధితుడు ఇంటికి వెళ్లిపోయాడు.

ఘనంగా వైష్ణవ కృష్ణాష్టమి వేడుకలు

- హాజరైన అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ దంపతులు


ఉట్టి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

ఉప్పునుంతల, సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, ఉప్పునుంతల మండల పరిధిలోని మామిళ్ళపల్లి లక్ష్మీరసింహ స్వామి ఆలయంలో సోమవారం వైష్ణవ కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ దంపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. స్వామికి ప్రత్యేక పూజలు చేసి, పల్లకీ సేవలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ అవరణలో ఉట్లు కొట్టారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నరసింహారావు, నాయకులు అనంతరెడ్డి గంగుల నరసింహారెడ్డి, రామచంద్రయ్య, ఇంద్రాసేనారెడ్డి, మోహన్‌గౌడ్, రామస్వామి, వెంకటేశ్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

- అఖిలపక్షం నాయకుల డిమాండ్
- అయిజ మునిసిపల్ కార్యాలయం ముట్టడి

అయిజ, సెప్టెంబ రు 15 (ఆంధ్రజ్యోతి) : సమస్యలను పరి ష్కరించాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్ష కమిటీ సభ్యులు సోమవారం మునిసిపల్ కార్యాలయాన్ని ముట్టడించారు. కమిటీ అధ్యక్షుడు హోమ్‌నీ డ్స్ ఆంజనేయులు, గౌరవ అధ్యక్షుడు జ గపతి రెడ్డి అధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. అక్కడి నుంచి ర్యాలీగా మునిసిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ ఎస్‌ఐ శ్రీనివాసరావు వారిని అడ్డుకునేందుకు యత్నించారు. శాంతియుతంగా ఆందోళన చేస్తామని వారు హామీ ఇవ్వడంతో పక్కకు తప్పుకున్నారు. అనంతరం కార్యాలయం ముందు బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ కార్యాలయ అధికారులు ఒక్కో పనికి ఒక్కో రేటు పెట్టి ప్రజలను పీడిస్తున్నారని విమర్శించారు. కమిషనర్ సెలవు పెట్టకుండా, సమయం మించిపోయినా ఆఫీసుకు రాకపోవడం ఏమిటని ప్రశ్నించారు.

అనంతరం ఏఈ రాజశేఖర్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఆందోళనలో కమిటీ సభ్యులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, మెడికల్ తిర్మల్ రెడ్డి, తాహెర్, భాస్కర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, అశోక్, పల్లయ్య, అంజి, శరణప్ప, నీలకంఠం పాల్గొన్నారు.

మరో వ్యక్తిపై కొండముచ్చు దాడి

- 11కు చేరిన బాధితుల సంఖ్య
- భయపడుతున్న మద్దూరు ప్రజలు

మద్దూర్, సెప్టెంబర్ 15(ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, మద్దూరులో కొండముచ్చుల దాడిలో మరో వ్యక్తి గాయపడ్డాడు. దీంతో బాధితుల సంఖ్య 11కు చేరింది. స్థానిక ఉర్దూ మీడియం పాఠశాల సమీపంలో కిరాణం వ్యాపారి రసూల్ సోమవారం దుకాణం ముందు కూర్చొని ఉండగా, కొండముచ్చు దాడి చేసి రక్కేసింది. దీంతో అతడు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేయించుకొని, మెరుగైన వైద్యం కోసం నారాయణపేట ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాడు. కొండముచ్చులను పట్టుకునేందుకు మునిసిపల్ శాఖ అధికారులు నెల్లూరు నుంచి ప్రత్యేక బృందాన్ని రప్పించారు. వారు ఏర్పాటు చేసిన బోనులో సోమవారం ఏడు కొండముచ్చులు చిక్కాయి. మిగిలిన వాటిని కూడా బంధించి అడవిలో వదిలేస్తామని మునిసిపల్ కమిషనర్ శ్రీకాంత్ తెలిపారు.

బైకుపై నుంచి కిందపడి యువకుడికి తీవ్ర గాయాలు

తాడూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనంపై నుంచి కింద పడి ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. నాగర్‌కర్నూల్ జిల్లా, తాడూరు మండలంలోని యంగంపల్లి సమీపంలో ఈ సంఘటన జరిగింది. బిజినేపల్లి మండలంలోని గుడ్లనర్వ గ్రామానికి చెందిన అరవింద్ సోమవారం తెల్లవారుజామున ద్విచక్రవాహనంపై నాగర్‌కర్నూల్ నుంచి కల్వకుర్తికి బయలుదేరాడు. అంతకు ముందు యంగంపల్లి గేటు సమీపంలో రోడ్డు దాటుతున్న గేదెను గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో అది చనిపోయింది. రోడ్డుపైనే పడి ఉన్న గేదె కళేబరాన్ని గమనించని అరవింద్ ఢీకొనడంతో కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గమనించి 108 అంబులెన్సుకు సమాచారం అందించి, కల్వకుర్తి సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ గురుస్వామి తెలిపారు.

చోరీ కేసులో ఆరుగురి అరెస్టు

- 2.5 తులాల బంగారం, 43 తులాల వెండి స్వాధీనం
- డీఎస్పీ వెంకటేశ్వరరావు

వనపర్తి రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : చోరీ కేసులో ఆరుగురిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ వెంకటేశ్వరరావు వెల్లడించారు. వనపర్తి పట్టణంలోని రూరల్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వనపర్తి మండలం పెద్దగూడెం తండాకు చెందిన బాణావత్ ప్రసాద్ అనారోగ్యంతో బాధపడుతున్న తల్లిని చికిత్స కోసం గత నెల 26న హైదరాబాద్‌కు తీసుకెళ్లాడు. ఈ నెల 7న ఇంటికి తిరిగి వచ్చే సరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోనికి వెళ్లి చూడగా ఇంట్లోని బంగారు పుస్తెలతాడు, కమ్మలు, మాటీలు, గొలుసు, ఉంగరం, 30 తులాల వెండి వస్తువులు చోరీకి గురైనట్లు గుర్తించి, పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీఐ కృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి విచారణ చేపట్టారు. ఈ నెల 14న పెద్దగూడెం క్రాస్ రోడ్డు వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా, పెబ్బేరు నుంచి వనపర్తికి వస్తున్న ఓమిని వ్యాన్‌ను ఆపారు. అందులో ఆరుగురు అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకొని విచారించారు.

నాగర్‌కర్నూల్ జిల్లా, పెద్దకొత్తపల్లి మండలంలోని కొత్తపేటకు చెందిన కొండ హరికృష్ణ, గుజ్జుల కృష్ణయ్య, గుజ్జుల వినోద్, గుజ్జుల భాగ్యలక్ష్మి, పెబ్బేరుకు చెంది న గుజ్జుల రాజశేఖర్, గుజ్జుల లక్ష్మిలుగా గుర్తించారు. వీరు ఆరుగురూ ఒక ముఠాగా ఏర్పడ్డారు. ఓమిని వాహనంలో ప్రతీ రోజు బొంతలు కుడతాం అంటూ వివిధ గ్రామాల్లో తిరుగుతూ తాళం వేసిన ఇళ్లను గుర్తించి, రాత్రి వేళల్లో దొంగతనాలకు పాల్పడుతున్నారు. మెంటపల్లి, పెబ్బేరు, ఆత్మకూరు, నాగర్‌కర్నూల్‌లలో చోరీలు చేసినట్లు విచారణలో నిందితులు అంగీకరించారు. వారి నుంచి 2.5 తులాల బంగారం, 43 తులాల వెండి, రూ. 25 వేలు స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. సమావేశంలో ఎస్‌ఐలు జలంధర్‌రెడ్డి, వేణుగోపాల్, సీఐ కృష్ణ పాల్గొన్నారు.

ప్రీ ఆర్‌డీ కాంటినెంట్ లీడర్‌గా పీయూ అధ్యాపకుడు

పాలమూరు యూనివర్సిటీ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పాలమూరు యూనివర్సిటీలో ఎంబీఏ విభాగంలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎస్.అర్జున్‌కుమార్ ప్రీ ఆర్‌డీ క్యాంప్ గ్రూప్ మెంబర్‌గా (కాంటినెంట్ లీడర్‌గా) ఎంపికయ్యారు. గుజరాత్ రాష్ట్రంలో నవంబరులో జరిగే ప్రీ ఆర్‌డీ క్యాంపు నిర్వహణ కార్యక్రమానికి హాజరు కానున్నారు. ఈ ఏడాది తెలంగాణ రాష్ట్రంలోని కాకతీయ యూనివర్సిటీ నుంచి ఒకరు, పాలమూరు యూనివర్సిటీ నుంచి మరొకరు ప్రోగ్రాం ఆఫీసర్లుగా ఎంపికయ్యారు. ప్రీ ఆర్‌డీలో విద్యార్థులకు అన్ని రంగాల్లో శిక్షణ ఇచ్చి వారిని ఆర్‌డీకి ఎంపిక చేసి జనవరి 26 రిపబ్లిక్ డే రోజు రాష్ట్రపతి ముందు ప్రదర్శనలు చేస్తారు. ప్రీ ఆర్‌డీ క్యాంపునకు కాంటినెంట్ లీడర్‌గా ఎంపికైనందుకు పీయూ వీసీ ప్రొఫెసర్ జీన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ పూస రమేశ్‌బాబు అధికారులు సోమవారం అర్జున్ కుమార్‌ను శాలువా కప్పి సత్కరించారు.

సీఎం సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలి

- రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి


బాధిత కుటుంబ సభ్యుడికి చెక్కును అందజేస్తున్న గోలి శ్రీనివాస్‌రెడ్డి

వెల్దండ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరమని, సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా, వెల్దండకు చెందిన జంగిలి సునిత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఆమెకు మెరుగైన చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయ నిధినుంచి రూ.17వేలు మంజూరయ్యాయి. దీనికి సంబంధించి చెక్కు, ఎల్‌వోసీలను సోమవారం బాధిత కుటుంబీకులకు అందించారు. అనంతరం మాట్లాడుతూ బాధితులను గుర్తించి, వారికి ఈ పథకం అమలయ్యేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్లు నాగులునాయక్, శేఖర్, నాయకులు చల్లా మధుసూదన్‌రెడ్డి, జంగిలి ఆనందు, నిరంజన్, నర్సింహ, జోగయ్య, బీమయ్యగౌడ్, శ్రీనివాస్, రవికుమార్, వెంకట్, శ్రీను, రమేశ్, రాజు, ఎంఎస్ గౌడ్ తదితరులు ఉన్నారు.

కొడుకు పట్టించుకోవడం లేదు

- వృద్ధుడి ఆవేదన, 'ప్రజావాణి'లో ఫిర్యాదు


కలెక్టరేట్ ప్రజావాణి వద్ద ఫిర్యాదుతో వృద్ధుడు రాగి చిన్న జంగిరెడ్డి

నాగర్‌కర్నూల్ టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగిగా పని చే స్తున్న తన పెద్ద కుమారుడు తనను పట్టిం చుకోవడం లేదని ఓ వృద్ధుడు ఆవేదన వ్యక్తం చేశాడు. తనకు న్యాయం చేయాలని కోరుతూ నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా, బిజినేపల్లి మండలంలోని వట్టెం గ్రామానికి చెందిన వృద్ధుడు రాగి చిన్న జంగిరెడ్డి భార్య చాలా ఏళ్ల క్రితమే మృతి చెందింది. పెద్ద కుమారుడు మండలంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. చిన్న కుమారుడు పొలం పనులు చేసుకుంటూ జీవనం గడుపుతున్నాడు. ప్రస్తుతం జంగిరెడ్డి తన ఇంటి స్థలంలోని రేకుల షెడ్డులో నివసిస్తున్నాడు. పెద్ద కుమారుడు తనను పట్టించుకోవడం లేదంటూ గతంలో ఆర్డీవోకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఆ ఫిర్యాదును వెనక్కి తీసుకుంటేనే తాను పోషిస్తానని పెద్ద కుమారుడు అంటున్నాడు. తన కుమారుడు ప్రభుత్వ ఉద్యోగి కావడంతో తనకు వృద్ధాప్య పెన్షన్ కూడా రావడం లేదని జంగిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. పోషణ చట్టం ప్రకారం చర్యలు తీసుకొని తనను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

న్యూస్ బాక్స్

నిబంధనల ప్రకారం పరిహారం అందిస్తాం : అదనపు కలెక్టర్

అచ్చంపేట రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ నిబంధనలు ప్రకారమే భూనిర్వాసితులకు నష్ట పరిహారం అందుతుందని అడిషనల్ కలెక్టర్ అమరేందర్ అన్నారు. సోమవారం అచ్చంపేట మండలం మన్నెవారిపల్లి గ్రామ పంచాయతీ మర్లపాడు తండా, కేశ్యతండాలకు సంబంధించిన ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీల గురించి ఏర్పాటు చేసిన గ్రామ సభలో అయన భూనిర్వాసితులకు వివరించారు. పాత ధరలకు కాకుండా పెంచి నష్టపరిహారం ఇవ్వాలని బాధితులు అధికారులను కోరారు. అచ్చంపేట ఆర్డీవో మాధవి, అచ్చంపేట తహసీల్దార్ సైదులు, కాంగ్రెస్ నాయకులు, నిర్వాసితులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై పోరాటం

కల్వకుర్తి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగ సమస్యలపై పీడీఎస్‌యూ రాజీలేని పోరాటం చేస్తుందని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంతోష్ అన్నారు. కల్వకుర్తి పట్టణంలో సోమవారం న్యూఎరా జూనియర్ కళాశాల, అంబేడ్కర్ పారా మెడికల్ కళాశాలలో పీడీఎస్‌యూ సభ్యత్వ నమోదును నిర్వహించారు. విద్యార్థులు స్వచ్ఛందంగా పీడీఎస్‌యూలో చేరాలని ఆయన కోరారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు కార్తీక్, అరవింద్, అనిల్ తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయుల ఔదార్యం

వెల్దండ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండల కాంప్లెక్స్‌లో సీఆర్‌పీగా విధులు నిర్వహిస్తున్న చంద్రశేఖర్ కుటుంబానికి మండల ఉపాధ్యాయులు అండగా నిలిచారు. చంద్రశేఖర్ అమ్మమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా బాధిత కుటుంబాన్ని సోమవారం ఎంఈవో చంద్రుడు నాయక్‌తో కలిసి కాంప్లెక్స్ ఉపాధ్యాయులు పరామర్శించారు. ఎంఈవో ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, సర్వశిక్షాఅభియాన్ ఉద్యోగులు బాధిత కుటుంబానికి అండగా నిలిచేందుకు రూ.65వేల సమకూర్చి చంద్రశేఖర్‌కు అందజేశారు.

ప్రజా సమస్యలు పట్టని సీఎం

- బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రాంచందర్

నాగర్‌కర్నూల్ టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో రైతులు, ప్రజా సమస్యలు పట్టించుకోని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేయాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బోనాసి రాంచందర్ డిమాండ్ చేశారు. సోమవారం బీఎస్పీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టరేట్ పరిపాలనాధికారి చంద్రశేఖర్‌కు అందజేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం ప్రభుత్వాన్ని యూరియా, ఫీజు రీ ఇంబర్స్‌మెంటు, గ్రూప్-1 పరీక్ష సమస్యలతో రైతాంగం, విద్యార్థులు ఇబ్బందులుపడుతున్నారని పేర్కొన్నారు. బీఎస్పీ నాగర్‌కర్నూల్ అసెంబ్లీ నియోజకవర్గఇన్‌చార్జి కొత్తపల్లి కుమార్, జిల్లా ఇన్‌చార్జీలు బీసమొళ్ల యోసేఫ్, పృథ్వీరాజ్, నాయకులు కళ్యాణ్, అంతటి నాగన్న, రామన్న, మండ్ల షైబూస్, కృపానందం, నాగేష్, మల్లన్న, కురు మయ్య, నాయకులు రాజు, భాస్కర్, రాంచం దర్, శంకర్, నాగేష్, శ్రీను పాల్గొన్నారు.

'పత్తి పంట ఎకరాకు రూ.50వేల పరిహారం చెల్లించాలి'

తాడూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : నెల రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల నష్టపోయిన పత్తి రైతులను ఎకరాకు 50వేల చొప్పున పరిహారం చెల్లించి ఆదుకోవాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కొమ్ము భరత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం డీహెచ్‌పీఎస్ నాయకులు బృందం మండల పరిధిలోని యాదిరెడ్డిపల్లి, ఇంద్రకల్, ఐతోల్, అంతారం గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి పంట పొలాలను పరిశీలించారు. వర్షాలతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఎకరాకు నష్టపరిహారం రూ.50వేలు చెల్లించి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంతారం గ్రామ మాజీ సర్పంచ్ చిన్న రాములు, డీహెచ్‌పీఎస్ నాయకులు నరసింహ, కృష్ణయ్య, శ్రీశైలం, బంగారయ్య, బహుగుణ, జగన్‌నాయక్, ఎర్రమైసన్న, పెద్దరాములు, రాములు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

'రెండవ విడత దళితబంధు యూనిట్లు పంపిణీ చేయాలి'

చారకొండ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రెండవ విడత దళితబంధు యూనిట్లు పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో లబ్ధిదారులు ఏవో చంద్రశేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రెండవ విడత దళితబంధు పథకానికి 279 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి నిధులు మంజూరు చేసినప్పటికీ తమకు యూనిట్లు పంపిణీ చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నదని అన్నారు. ఈ సంఘటనపై కలెక్టర్ స్పందించి ఎంపికైన లబ్ధిదారులకు యూనిట్లు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో రమేష్, శంకర్, గణేష్, రాకేష్, శ్రీశైలం, వెంకటయ్య పాల్గొన్నారు.

సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తున్న బీజేపీ : సీపీఐ

కల్వకుర్తి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట చరిత్రను బీజేపీ వక్రీకరిస్తుందని సీపీఐ తాలూకా ఇన్‌చార్జి పులిజాల పరశురాములు అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా కల్వకుర్తి పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్స వాలను నిర్వహించారు. సందర్భంగా పరశురా ములు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఐ తాలూకా సహాయ కార్యదర్శి ధారదాసు, నాయకులు రాజు, బాలయ్య, శ్రీరాములు, పరశురాములు, శివ, రామస్వామి, నరసింహ తదితరులు ఉన్నారు.

ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి



ప్రజావాణిలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

- ప్రజావాణిలో కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా తక్షణమే పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ బదావత్ సంతోష్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దేవసహాయంతో కలిసి కలెక్టర్ దరఖాస్తుదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ విభాగాల సూపరింటెండెంట్లు, సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్య మహిళతో శక్తిమంతమైన కుటుంబం

మహిళలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే శక్తిమంతమైన కుటుంబం సాధ్యమవుతుందని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వివిధ శాఖల సమన్వయ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు జిల్లాలో ఆరోగ్య మహిళ- శక్తివంతమైన కుటుంబం కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో, ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల్లో స్పెషలిస్టు వైద్య నిపుణులచే వైద్య శిబిరాలు నిర్వహించాలని అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకో వాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దేవసహాయం, డీసీహెచ్‌ఎస్ డక్టార్ రామకృష్ణ, ఆర్‌ఎంవో డాక్టర్ రవిశంకర్, జిల్లా డిప్యూటీ మాస్ మీడియా అధికారి రాజగోపాలాచారి పాల్గొన్నారు.

సామాజిక స్ఫూర్తి అలవర్చాలి

కందనూలు : పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో సామాజిక స్ఫూర్తిని పెంపొందించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ సూచించారు. సోమవారం నాగర్‌కర్నూల్ మండల పరిధిలోని తూడుకుర్తి గ్రామంలో సికింద్రాబాద్ కస్తూర్బా గాంధీ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థినులు గ్రామంలోని విద్యార్థులకు, గ్రామస్థులకు పరిశుభ్రత, జంతువుల నుంచి వచ్చే వ్యాధులు, సేంద్రియ వ్యవసాయం, ప్లాస్టిక్ వినియోగంపై కలిగే అనర్థాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సమాజం పట్ల సేవభావనను పెంపొందించడం, ప్రజల సమస్యలపై అవగాహన కల్పించడానికి తూడుకుర్తి గ్రామాన్ని ఎంచుకున్నందుకు డిగ్రీ, పీజీ విద్యార్థులను అభినందించారు. డీఈవో రమేష్ కుమార్, ఎంపీడీవో, ఎంపీవో భరత్, ఎంఈవో భాస్కర్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రఘు, గ్రామ ప్రజలు ఉపాధ్యాయులు, విద్యార్థి నులు పాల్గొన్నారు.

బాట కోసం జమిస్తాపూర్ గ్రామస్థుల వినతి

నాగర్‌కర్నూల్‌టౌన్ : తమ వ్యవసాయ పొలాలకు పూర్వం నుంచి ఉన్న బాట సమస్యను పరిష్కరించాలని కోరుతూ తెల్కపల్లి మండలం జమిస్తాపూర్ గ్రామానికి చెందిన రైతులు శ్రీనివాసులు, యల్లయ్య, సుధాకర్, జంగయ్య, రాములు కాశన్న తదితర రైతులు సోమవారం కలెక్టరేట్ ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. గ్రామ శివారులోని 100, 102, 103, 104 సర్వే నెంబర్లలో తమకు వ్యవసాయ పొలాలు ఉన్నాయని, పూర్వం నుంచి ఉన్న బాటను ఇటీవలే కొందరు వ్యక్తులు మూసివేసి రానీయకపోవడంతో పొలాలు బీడులు పెట్టామని ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతు లు తిరుపతయ్య, లక్ష్మయ్య, నిరంజన్, శివప్ర సాద్ పాల్గొన్నారు.

పెంట్లవెల్లి బస్టాండును వినియోగంలోకి తేవాలి

నిరుపయోగంగా ఉన్న పెంట్లవెల్లిలోని ఆర్టీసీ బస్టాండులో కనీస సౌకర్యాలు కల్పించి వినియోగంలోకి తీసుకురావాలని గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త మూలే మేఘరాజు సోమవారం కలెక్టరేట్ ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు.

పోలీసు ప్రజావాణికి 15 ఫిర్యాదులు

నాగర్‌కర్నూల్ (ఆంధ్రజ్యోతి) : ఎస్పీ కార్యాలయంలో సో మవారం నిర్వహించిన ప్రజావాణికి 15 ఫిర్యాదులు వచ్చినట్లు ఎస్పీ గైక్వాడ్‌వైభవ్ రఘునాథ్ తెలిపారు. ఫిర్యాదుదారులతో ఎస్పీ స్వయంగా మాట్లాడి ఫిర్యాదుదారుల సమస్యలను అడిగి తెలుసుకుని సంబంధిత పోలీస్ అధికారులకు సమస్యలను త్వరితగ తిన పరిష్కరించాలని ఆదేశించారు. భూత గాదాలు-10, కుటుంబ గొడవలు-02, ఇతర ఫిర్యాదులు-3 వచ్చినట్లు ఎస్పీ తెలిపారు.

ప్రతీ ఇంటికి మిషన్ భగీరథ నీళ్లు అందించాలి

- ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని ప్రతీ ఇంటికి మిషన్ భగీరథ నీళ్లు అందించాలని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మిషన్‌భగీరథ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతీ గ్రామానికి మిషన్ భగీరథ కనెక్షన్లు ఇవ్వాలన్నారు. ఎక్కడా లీకేజీలు లేకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేసి తాగునీటి సరఫరాకు అడ్డంకులు లేకుండా చూడాలన్నారు. గ్రామాలోకతని ట్యాంక్‌లను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలన్నారు. కార్యక్రమంలో డీఈ హేమలత, అధికారులు పాల్గొన్నారు.

ప్రత్యేక బోధన అభ్యసనాలతో కృషి

- డీఈవో రమేష్‌కుమార్

కందనూలు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థుల విద్యా ప్రమాణాల అభివృద్ధికి ఉపాధ్యాయులు ప్రత్యేక బోధన అభ్యసనాలతో కృషి చేయాల్సినవసరం ఉందని జిల్లా విద్యాశాఖ అధికారి ఏ.రమేష్‌కుమార్ అన్నారు. సోమవారం నాగర్‌కర్నూల్ మండల పరిధిలోని శ్రీపురం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను డీఈవో తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరిశీలించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి : డిప్యూటీ డీఎంహెచ్‌వో

బల్మూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి పరిరక్షణ చేపట్టాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో తారాసింగ్ అన్నారు. సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీజనల్ వ్యాధులపై సమీక్ష సమావేశం నిర్వహించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కలుషిత నీరు తాగడం, పరిసరాలు అపరిశుభ్రంగా మారు తుండడంతో దోమల వ్యాప్తి పెరిగి మలేరియా, డెంగీ, చికున్‌గున్యా వంటి సీజనల్ వ్యాధులు పెరిగిపోతున్నాయి. ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారిని డాక్టర్ కల్పనా, ఫార్మసీ ఆఫీసర్ శ్రీనివాసులు, సీహెచ్‌వో విజయ్‌కుమార్, సూపర్‌వైజర్లు ఉమా, వెంకటమ్మ, హెల్త్‌అసిస్టెంట్, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి : బీజేపీ

ఉప్పునుంతల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎన్నికల్లో బీజేపి సత్తా చాటేందుకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలని ఆ పార్టీ అధికార ప్రతినిధి కట్టా సుధాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో బీజేపీ కార్యకర్తల సమావేశం మండల అధ్యక్షుడు మహేష్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈనెల 17న ప్రధానమంత్రి నరేంద్రమోదీ పుట్టిన రోజు సందర్భంగా అచ్చంపేటలో భారీ బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు పాల్గొంటారని తెలిపారు. బీజేపీ నాయకులు మండికారి బాలాజీ, కొండల్‌రెడ్డి, సైదులుయాదవ్, శ్రీను నాయక్, రమేస్, సురేందర్‌రెడ్డి, అంజి, చందు ఉన్నారు.

చారకొండలో సంత మార్పు

చారకొండ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) మండల కేంద్రంలో ప్రతీ శనివారం ప్రధాన రహదారి సమీపంలో నిర్వహించే వారంతపు సంతను గ్రామంలోని బొడ్రాయి నుంచి పీర్ల చావిడి వరకు మార్చినట్లు ఎంపీడీవో శంకర్‌నాయక్ తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శంషుద్దీన్, పంచాయతీ కార్యదర్శి గణేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జమ్మికింది బాలరాం గౌడ్, సింగిల్‌విండో డైరెక్టర్ జగన్‌మోహన్, ఎన్‌ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు శివపాల్గొన్నారు.

నిరుద్యోగుల భవిష్యత్‌తో కాంగ్రెస్ చెలగాటం : బీఆర్‌ఎస్‌వీ

కొల్లాపూర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగ యువతీ యువకులపై కాంగ్రెస్ కపట ప్రేమ చూపుతూ చెలగాటమాడుతోందని బీఆర్‌ఎస్వీ నాయకులు శేఖర్, కలర్ మహేష్ పేర్కొన్నారు. గ్రూప్-1 పోస్టుల్లో మొత్తం 563 ఉద్యోగాలు ప్రభుత్వం అమ్ముకుందని వారు విమర్శించారు. గ్రూప్-1 పరీక్షలు మళ్లీ నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు.బీఆర్‌ఎస్‌వీ నాయకులు శేఖర్, మహేష్‌లను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.


చెరువు గండిని పూడ్చాలని వినతి

బిజినేపల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నందివడ్డెమాన్ గ్రామంలో భీమసముద్రం చెరువుకు ఇటీవల వర్షాలకు చెరువు కట్ట తెగిపోయే ప్రమాదం ఉందని ముందస్తుగా అలుగుకు గండి కొట్టి నీటిని కిందికి వదిలేశారు. ప్రస్తుతం వర్షాలకు కురవకపోవడంతో నీళ్లు వృథాగాపోతున్నాయని సోమవారం రైతులు ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డికి విన్నవించారు. వెంటనే సంబంధిత శాఖ అధికారులకు ఆదేశించి మరమ్మతులు చేయిస్తానని ఎమ్మెల్యే రైతులకు హామీ ఇవ్వడంతో సంతోషం వ్యక్తం చేశారు.

సిర్సవాడ విద్యార్థికి ఘన సన్మానం

తాడూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సిర్సవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న మొబీనాబేగం అనే విద్యార్థికి రాష్ట్ర స్థాయి పురస్కారం లభించింది. ఇటీవల చిమ్మపూడి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు పోటీపరీక్షలు నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆరుగురు ఉత్తమ విద్యార్థులు ఎంపిక కాగా, అందులో మొబినాబేగం ఉన్నారు. ఆమె హైదరాబాద్‌లోని చిక్కడపల్లిలో ఉన్న త్యాగరా య గానసభ హాలులో మాజీ టీటీడీ చైర్మన్ రమ ణాచార్యుల చేతుల మీదుగా ప్రశంసాపత్రం, బహుమతి అందుకున్నారు. పాఠశాల ఉపాధ్యాయులను, మొబినాబేగం తల్లిదండ్రులు ఎండీనజీర్, షబానా బేగంలను గ్రామస్థులు అభినందించారు.

కాంగ్రెస్ నుంచి బీజేపీలో పలువురి చేరిక



ఎల్లేని సుధాకర్‌రావు సమక్షంలో బీజేపీలో చేరిన మరికల్ గ్రామ కాంగ్రెస్ నాయకులు

పెద్దకొత్తపల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రధాని నరేంద్రమోదీ పాలనను మెచ్చి మండలంలోని మరికల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మాజీ ఉపసర్పంచ్ బొల్లె జగన్‌తో పాటు పలువురు సోమవారం బీజేపీలో చేరారు. పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు సమక్షంలో బీజే పీలో సురేష్, శివుడు, ఏసురత్నంతో పాటు మరికొందరు చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎల్లేని మాట్లాడుతూ కొల్లాపూర్‌నియోజకవర్గంలోని గ్రామాల్లో ప్రజలకు కాంగ్రెస్ పట్ల మంత్రి జూపల్లిపై నమ్మకం పోయిందన్నారు. మండల అధ్యక్షుడు దేశమోని పరశురాముడు, జిల్లా ఉపాధ్యక్షుడు తమటం శేఖర్‌గౌడ్, జిల్లా కార్యదర్శి బెల్లి తిరుమల్ యాదవ్, శివ, అమ్మపల్లి మల్లేష్ పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఇంజనీర్లకు సన్మానం

కల్వకుర్తి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఇంజనీర్స్‌డేను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కల్వకుర్తిలోని విద్యుత్ కార్యాలయంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఇంజనీర్లను శాలువాలతో సత్కరించారు. విద్యుత్ డీఈ శ్రీధర్‌శెట్టి, ఏఈడీ శంకరయ్య, ఏఈలు శ్రీనివాస్, మేఘనాథ్, జానకిరాం, వసంత, అంకిత, రమణి తదితరులను లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు చిగుళ్లపల్లి శ్రీధర్ సత్కరించారు. కార్యక్రమంలో కార్యదర్శి గోపాల్, నాయకులు కిషన్, రాజేందర్, సత్యం, రమేష్ ఉన్నారు.

గ్రామాభివృద్ధికి సహకారం

తిమ్మాజిపేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : గ్రామాభివృద్ధిలో అందరూ కలిసిరావాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు మొసలి శ్యాంప్రసాద్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని గొరిటలో గ్రామ పంచాయతీకి నిధుల కొరత ఉండడంతో అదే గ్రామానికి చెందిన మొసలి శ్యాంప్రసాద్‌రెడ్డి సోమవారం గ్రామపంచాయతీ కార్యాలయానికి వెళ్లి పంచాయతీ కార్యదర్శి రామస్వామికి చెత్త సేకరించడానికి ట్రాక్టర్ డీజిల్ కోసమని పదివేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆంజనేయులు, తిరుపతమయ్య, పరశురాములు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

వంగూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తుమ్మలపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో యూత్ ఫర్ సేవ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, స్టేషనరి వస్తువులను పంపిణీ చేశారు. సంస్థ సభ్యులకు పాఠశాల హెచ్ఎం వేముల సైదులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈవో కృష్ణయ్య, సంస్థ సభ్యులు అనిల్, భగత్. పాఠశాల కమిటీ అధ్యక్షురాలు వెంకటమ్మ, ఉపాధ్యాయులు రాజ్యలత, కోటేశ్వర్‌రావు, సునిత పాల్గొన్నారు.

18న క్రీడలకు విద్యార్థుల ఎంపిక

తాడూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన అండర్-14, అండర్-17 వాలీబాల్ టీములకు సంబంధించి ఈ నెల 18న జిల్లా పరిషత్ తాడూరు ఉన్నత పాఠశాలలో విద్యార్థులను ఎంపిక చేస్తున్నట్లు ఎంఈవో శ్రీనివాసులు తెలిపారు. సోమవారం స్థానిక ఎమ్మార్సీలో అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయుల సమావేశాన్ని నిర్వహించారు. ప్రతీ పాఠశాల నుంచి విద్యార్థులను ఈ ఎంపికలకు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అనిల్‌కుమార్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు పి.శేఖర్‌బాబు, యాదయ్య, సునీత, అనిత, రఘు, మంజుల పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు ఆరోగ్య భద్రత

- ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కశిరెడ్డి

కల్వకుర్తి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్‌ఎఫ్)తో పేదలకు ఆరోగ్యభద్రత చేకూరుతుందని స్థానిక ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని పలువురికి సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన చెక్కులను సోమవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే తన నివాసంలో ఎమ్మెల్యే అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేదల అభివృద్ధి, సంక్షేమం, ఆరోగ్య సంరక్షణ కోసం పని చేస్తుందన్నారు. సీఎంఆర్‌ఎఫ్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యుడు అశోక్‌రెడ్డి, నాయకులు తిరుపతిరెడ్డి, రఘు రాములు, సురేందర్‌రెడ్డి ఉన్నారు.

రైతుకు సరిపోను యూరియా అందిస్తాం

- వ్యవసాయ సహాయ సంచాలకుడు పూర్ణచంద్రారెడ్డి



మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి పూర్ణచంద్రారెడ్డి

తిమ్మాజిపేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రైతుకు సరిపోను యూరియా అందించేందుకు కృషి చేస్తున్నామని, ఆందోళనకు గురి కావద్దని వ్యవసాయసహాయ సంచాలకుడు పూర్ణచంద్రారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో సోమవారం మండల వ్యవసాయ అధికారి కమల్‌కుమార్, స్థానిక ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి, మండల ప్రజాప్రతినిధులు, గ్రామాల వారీగా ముఖ్య నాయకులు, ఆగ్రో డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2024వ సంవత్సరంలో 783మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా కాగా, ఈ సంవత్సరం 1264మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని, 481మెట్రిక్ టన్నుల యూరియా అధికంగా వచ్చినా రైతులకు ఎందుకు సరిపోవడం లేదని ఆయన ప్రశ్నించారు. రైతులు వర్షాకాలానికి సంబంధించిన పంటలకు మాత్రమే యూరియా కొనుగోలు చేయాలని, యాసంగి పంటలకు అక్టోబరులో అందుబాటులో ఉంటుందన్నారు. అధికారుల సమాచారం మేరకే ఆగ్రో రైతు సేవ కేంద్రాల వద్దకు రావాలని రైతులకు సూచించారు. ఏఈవోలు సాయిరాం, శివసాగర్, కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లయ్యగౌడ్, నాయకులు భాస్కర్‌రెడ్డి, భీమయ్య, మాజీ సర్పంచ్ నరసిం హారెడ్డి, సీపీఐ నాయకులు ఖాజామైనొద్దీన్ పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు త్వరగా చేపట్టండి

బల్మూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండనాగుల గ్రామంలో చేపడుతున్న రోడ్డువిస్తరణ పనులు నత్తనడకన సాగుతున్నాయని, త్వరగా పూర్తి చేయాలని పలువురు గ్రామస్థులు కోరారు. రోడ్డు విస్తరణ పనుల్లో ఆటంకాలను తొలగించి త్వరగా పనులు చేపట్టే విధంగా చూడాలని మండల పరిషత్ అధికారి రాఘవులు, గ్రామ కార్యదర్శి మధులకు పలువురు గ్రామస్థులు సోమవారం గ్రామపంచాయతీ ఆవరణలో వినతిపత్రం అందించారు. గ్రామంలోని ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి ఆంజనేయస్వామి దేవాలయం వరకు రోడ్డును వెడల్పు చేసి సీసీ రోడ్డుగా మార్చడానికి ఎమ్మెల్యే వంశీకృష్ణ రూ.కోటీ50లక్షలు మంజూరు చేశారని తెలిపారు.విస్తరణలో రోడ్డును తగ్గించుకోవాలని కొందరు అడ్డుపడుతుండగా మరికొందరు రోడ్డు విస్తరణ అంచనా ఎలా ఉందో అలా పనులు చేపట్టాలని డిమాండ్ చేయడంతో కొంత గందరగోళం నెలకొంది. అధికారులకు వినతిప త్రం ఇచ్చిన వారిలో గ్రామస్థులు సాయి, మహమూద్, సునీల్, చంద్రమౌళి, రాముడు, శ్రీనివాస్‌యాదవ్, ఆర్‌అండ్‌బీ శాఖ డీఈ, ఏఈ ఉన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు కళాశాలలు బంద్

- ప్రైవేట్ విద్యా సంస్థల అధ్యక్షుడు శ్రీనివాస్



కల్వకుర్తిలో కృష్ణవేణి డిగ్రీ కళాశాల యాజమాన్యం ఆధ్వర్యంలో బంద్ పాటిస్తున్న విద్యార్థులు

కందనూలు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేట్ బీఈడీ కళాశాలల సమస్యలు పరిష్కరించేంత వరకు కళాశాలలను బంద్ చేస్తామని ప్రైవేట్ విద్యాసంస్థల అధ్యక్షుడు శ్రీనివాస్ సోమవారం అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్ మెడికల్ ఫార్మసీ, బీఈడీ, ఇంజ నీరింగ్, డిగ్రీ కళాశాలలకు ప్రభు త్వం నుంచి రవాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్పు బకాయిలు విడుదల చేసేంత వర కు బంద్ చేయాలన్నా రాష్ట్ర విద్యా సంస్థల యాజమాన్యాల పిలుపు మేరకు సోమవారం జిల్లాలోని అచ్చంపేట, నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, కొల్లాపూర్ నియోజకవర్గాల్లో డిగ్రీ, బీఈడీ కళాశాలలుబంద్ నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్‌లో విశ్వవికాస్ డిగ్రీకాలేజ్, ప్రగతి బీఈడీ కాలేజీ, కల్వకుర్తిలోని వైఆర్‌ఎం డిగ్రీ కళాశాల, కృష్ణవేణి డిగ్రీ కళాశాల, అచ్చంపేటలోని చైతన్య డిగ్రీ కళాశాల, ప్రగతి డిగ్రీ కళాశాల, కొల్లాపూర్‌లోని మహాదేవి డిగ్రీ కళాశాలలు బంద్ చేసినట్లు ఆయన తెలిపారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని కృష్ణవేణి డిగ్రీ కళాశాల అధ్యాపకులు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిరసన తెలిపి కళాశాల బంద్ పాటించినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వం తక్షణమే తమ బకాయిలను వెంటనే విడుదల చేసి ఆదుకోవాలని కోరారు.

ఆలయాల అభివృద్ధికి ప్రాధాన్యం

- టాస్క్ సీవోవో, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

వెల్దండ, సెప్టంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రజల్లో ఆధ్యాత్మిక భావన పెంచేందుకు గ్రామాలలో ఆలయాల నిర్మాణాలు ఎంతైనా అవసరమని టాస్క్ సీవోవో, ఐక్యత ఫౌండేషన్ చైర్మెన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొట్ర గ్రామంలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన పూర్తిచేసుకున్న 41వ రోజును పురస్కరించుకుని సోమవారం నిర్వహించిన పూజా కార్యక్రమంలో రాఘవేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి తనవంతుగా ఆలయ గ్రిల్స్ ఏర్పాటుకు, విగ్రహ ప్రతిష్ఠాపనకు 2 లక్షల 20వేల రూపాయలు నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి తనవంతుగా సహకరిస్తానని తెలిపారు. అనంతరం గ్రామస్థులు, ఆలయ నిర్వాహకులు రాఘవేందర్‌రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రాములు, ఆలయ కమిటీ సభ్యులు అల్లాజీ, లక్ష్మయ్య, మల్లయ్య, బాల్‌చెన్నయ్య, మొగులయ్య, అంజనేయులు, చెన్నయ్య, కాషయ్య, జంగయ్య తదితరులు ఉన్నారు.

చేయూత పింఛన్లు పెంచాలి

- ఎంఎస్‌పీ జిల్లా కన్వీనర్ గూట విజయ్

- పింఛన్ హక్కుదారుల పోరాట సమితి ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ తహసీల్దారుకు వినతి



నాగర్‌కర్నూల్ తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న పింఛన్ పోరాట సమితి సభ్యులు

నాగర్‌కర్నూల్ టౌన్/ కల్వకుర్తి/ ఊర్కొండ/ పెంట్లవెల్లి/ వెల్దండ/ పెద్దకొత్తపల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన మాట ప్రకారం వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలకు పింఛన్ మొత్తాన్ని పెంచాలని మహాజన సోషలిస్టు పార్టీ (ఎంఎస్‌పీ) జిల్లా కన్వీనర్ గూట విజయ్ డిమాండ్ చేశారు. సోమవారం పింఛన్ హక్కుదారుల పోరాట సమితి ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. గూట విజయ్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వృద్ధులు, వితంతువుల పింఛన్‌ను రూ.2వేల నుంచి రూ.4 వేలకు, అలాగే వికలాంగుల పింఛన్‌ను రూ.4వేల నుంచి రూ.6 వేలకు పెంచుతామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 22 నెలలు గడిచినా ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదన్నారు. రాష్ట్రంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ నాయకత్వంలో చేయూత పింఛన్ పెంపు కోసం రెండు నెలలుగా పోరాటం చేస్తున్నా ప్రభుత్వం నుంచి స్పందన లేదని విమర్శించారు. చేయూత పింఛన్లు పెంచేదాక ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ సౌటకాశీం, నాయకులు నాగన్న, వీహెచ్‌పీఎస్ నాయకులు పాల్గొన్నారు. ఎమ్మార్పీ ఎస్ ఆధ్వర్యంలో జిల్లాలోని పలు ప్రాంతాల్లో పింఛన్‌దారులతో కలిసి ఆందోళనలు నిర్వహించి, స్థానిక అధికారులకు వినతిపత్రాలు అందజే శారు. ● కల్వకుర్తిలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యద ర్శి మబ్బు సాయన్నమాదిగ, ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి పర్వపాకుల శేఖర్ ఆధ్వర్యంలో తహసీల్దార్ ఇబ్రహీంకు వినతిపత్రం అందజేశారు. ● ఊర్కొండలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు దారా రాధాకృష్ణ ఆధ్వర్యంలో నాయబ్ తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం సమర్పించారు. ● పెంట్లవెల్లిలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బంకల కురుమయ్య ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో ఆర్‌ఐ బాలకోటికి వినతి పత్రం అందజేశారు. ● వెల్దండలో మండల ఇన్‌చార్జి రాజుమాదిగ, గ్రామ ఇన్‌చార్జి కొప్పు గెల్వయ్య ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టి, తహసీల్దార్ కార్తీక్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ● పెద్దకొత్తపల్లిలో మ్మార్పీఎస్ ఇన్‌చార్జి చెల్లెపాటి చంద్రమౌళి, వివిధ సంఘాల నాయకులు ఎన్.కృష్ణయ్య, ఎం.వెంకటయ్య, జి.స్వామి, పి.శ్రీను, కే.రాజు ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టి, తహసీల్దార్ రమేష్‌కు వినతిపత్రం అందజేశారు.